# స్నేహంలో భేదాలు

(కథానిక)

"శాంతా!" గుమ్మం దాటుతూనే సీత కేక పెట్టింది.

హడావుడిగా వస్తున్న సీతకు, శాంత వాళ్ల యింటి ముందు వసారాలో ఎక్కడా కనుపించలేదు.

"శాంతా, శాంతా" అని ఇంకా కొంచెం బిగ్గరగా కేకపెట్టింది సీత మధ్య హాలులోకి ప్రవేశిస్తూ.

శాంత అప్పుడే స్నానం ముగించి, చీరకట్టుకొని హాలులోకివస్తూ, సీత పొలికేకలువిన్నది.

"అబ్బ! వస్తున్నా. ఏమిటలా పొలికేకలు పెట్టున్నావు కొంప మునిగిపోయినట్టు" అంది శాంత.

చీర చుట్టుకొని వస్తున్న శాంతను చూసి సీత "వాట్! ఇంకా స్నానందగ్గరే ఉన్నావా? ఎంత లేజీ గరల్ వోయి నువ్వు! నాలుగు గంటలనుంచీ స్నానం చేస్తూనే ఉన్నావు. చూడు అప్పుడే నా వాచీలో ఆరుగంటలైంది." అంది మందలింపుగా.

"ఓస్ ఆరు గంటలేగా! ఇంకా గంట టైముంది. గంటలో ఎన్ని పనులయినా చేయవచ్చు" అంది శాంత చురుకుగా.

"సంతోషించాం గాని, తొందరగా తెముల్చుకొని టాయిలెట్టయి రా. లేకపోతే ఇవాళ మనం సినిమా చూసినట్లే."

"సరే. ఈ మ్యాగజైను చూస్తూ ఉండు. ఇంతలో నేను డ్రెస్సు చేసుకొని వస్తాను." అంటూ సీతకు మ్యాగజైను ఇచ్చి శాంత లోపలికి పోయింది.

సీత వసారాలో ఉన్న కుర్చీలో కూలబడి పత్రిక పేజీలు తిప్పేస్తున్నది.

సీతా, శాంతలు మంచి స్నేహితురాండ్రు. ఇద్దరూ పదిహేనో సంవత్సరంలో అడుగుపెట్టారు. ఇద్దరూ సుందరులే. ఇద్దరూ సామాన్య కుటుంబాలకు చెందినవారనే చెప్పాలి. ఇద్దరూ ఫిఫ్త్ ఫారం చదువుతున్నారు.

పదిహేను నిమిషాలలో నీటుగా ముస్తాబయి వచ్చింది శాంత. శాంత తల్లిదగ్గర అనుమతి తీసుకొని సీతతో సినిమాకు ఫస్టుషోకి వెళ్ళింది.

హృదయం గల అందరిలాగానే ఆ సినిమా వారి జాలి హృదయాలను కదిలించింది.

సినిమానుంచి శాంత సీతలు ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి రాత్రి పదిగంటలయింది. శాంత యిల్లు సినిమా హాలుకు దగ్గరలోనే ఉంది. సీత యిల్లు శాంత యింటికి ఇంకా మైలు దూరం పోవాలి.

ముందుగా వేసుకొన్న ప్రోగ్రాం ప్రకారం సీత శాంత యింట్లోనే భోజనం చేసింది. తరువాత పన్నెండు గంటలదాకా ఆ స్నేహితురాండ్రు ఏదో నవ్వుకుంటూ మాట్లాడుకుంటూ ఉన్నారు.

తరువాత కొన్నాళ్లకి శాంత జబ్బు పడింది. ఆ జబ్బులో సీత ఎప్పుడూ రాత్రిం బగళ్ళూ శాంత ప్రక్కనే ఉండి, మందూ మాకూ అన్నీ తనే చూచుకుంది. సీత ఎడతెగని పరిచర్యల వల్ల శాంత త్వరలోనే కోలుకొంది. శాంత తలిదండ్రులు సీత ఉపచారాలకు ఆమెకు తమ మనస్సులలోనే అనేక ధన్యవాదాలర్పించుకున్నారు. సీతా శాంతల బాల్యస్నేహం గాఢమయినది. దానికి గీటురాళ్లు లేవు.

* * *

మామూలు వేళకు చంద్రం స్కూలుకు హాజరై రమాకాంతం వచ్చాడేమోనని చుట్టూ కలియ చూసేడు. కాని అతని జాడ ఎక్కడా కనపడలేదు. రోజూ వేళకి సరిగా వచ్చే తన స్నేహితుడి రాకలో ఆలస్యమవటానికి కారణమేమిటో చంద్రానికి బోధపడలేదు.

మొదటిబెల్లు, రెండోబెల్లు కూడా కొట్టారు.

"శ్రీ రాగి"

పిల్లలంతా క్లాసు రూములలోకి ఆదరా బాదరాగా వెళుతున్నారు. కాని రమాకాంతం జాడలెక్కడా లేవు.

చంద్రానికి క్లాసులోకి తన స్నేహితుడు లేకుండా వెళ్లటానికి మనసొప్పలేదు. క్లాసులోకి అడుగు పెట్టకుండానే స్కూలు ఆవరణలోంచి బయటికివచ్చి చంద్రం ఇంటివేపు దారి తీసేడు పుస్తకాలు చంకలో పెట్టుకొని, క్లాసు రూములోకి వెళ్లకుండా గృహోన్ముఖుడైన చంద్రాన్ని చూసి స్కూలు జవాను పిచ్చి చూపులు చూసేడు.

గబగబా అడుగులు వేసుకుంటూ చంద్రం రమాకాంతం ఇంటిని సమీపించాడు. ఇంటి తలుపులు దగ్గరగా వేసివున్నాయి. తలుపులు నెట్టుకుంటూ చంద్రం లోపల ప్రవేశించాడు.

బయట వసారాలో చాపమీద పుస్తకాల ముందు కూర్చున్న రమాకాంతం చంద్రాన్ని చూసి బడికి వెళ్ళకుండా తన యింటికి వచ్చినందుకు కొద్దిగా ఆశ్చర్యపడ్డాడు.

"ఏం కాంతం, బడి ఎగ్గొట్టావేం?" అని చాపమీద చతికిలబడ్డాడు చంద్రం.

"ఏం లేదురా? ఇంట్లో పనుండి అమ్మ వుండిపొమ్మంది" అన్నాడు కాంతం.

"అదేమిటిరా? ఇంట్లో పనికోసం బడి మానుకొంటారా?"

"అవును నీకంటే నౌకర్లున్నారు పనులుచేసి పెట్టటానికి. మా కెవరున్నారు?"

"కాదులేవోయ్? ఇదంతా పట్టి అబద్ధం. ఏదో కారణముంది. నాతో చెప్పకూడదా కాంతం? వంట్లో బాగా లేదా?"

"బాగా లేకపోవడమేం? దివ్యంగా వుంది."

"మరి?"

"మరేం లేదు. నువ్వు బడికి వెళ్ళిరా సాయంత్రం మాట్లాడుకొందాం."

"ఏడిశావు లేవోయ్! వెధవ కబుర్లు. ఉండు పెద్దమ్మనే అడుగుతా" అంటూ చంద్రం వంటయింట్లో వంట చేస్తున్న కాంతం తల్లితో మాట్లాడటానికి లోపలికి వెళ్లాడు.

చంద్రం, రమాకాంతం తల్లిని పెద్దమ్మ అంటాడు. ఆమెకూడా చంద్రాన్ని తన రెండో కొడుకులాగ చూసుకొంటుంది.

లోపలికి వస్తున్న చంద్రాన్ని చూసి కాంతం తల్లి "ఏం నాయనా బడికి వెళ్ళలేదూ? ఇలా వచ్చావు!" అంది.

"అది కాదు పెద్దమ్మా. ఇవాళ కాంతం బడి కెందుకు రాలేదు?"

"యేం చెప్పమంటావు నాయినా? ఈ నెల స్కూలు జీతం చెల్లించటానికి నిన్న ఆఖరి రోజటగా నాకు డబ్బు అందలేదు. జీతం కట్టలేదు. ఇవాళ స్కూల్లో పేరు కొట్టేస్తారుటగా. అందుకని బడికి వెళ్ళి తిరిగి రావటం ఎందుకని ఇంట్లోనే కూర్చున్నాడు"

"అదా సంగతి? ఏమోయి కాంతం ఇది నాతో చెప్పటానికి సిగ్గుపడతా వెందుకు?" అన్నాడు చంద్రం కాంతాన్ని చూసి.

రమాకాంతం మాట్లాడలేదు.

"రెండు గంటలకి ఇద్దరం కలిసి బడికి వెళ్దాం. సిద్ధంగా వుండు" అంటూ చంద్రం ఇంటికి వెళ్లాడు.

కాంతం, చంద్రం ఇద్దరు స్కూలు ఫైనలు చదువుతున్నారు చంద్రం తండ్రి లక్షాధికారుల జాబితాలో చేరకపోయినా తను తిని ఒకళ్లకు పెట్టగల తాహతు గలవాడు.

కాంతం నిరుపేద అతని పదవయేటనే తండ్రి గతించాడు. తండ్రి చచ్చిపోయేటప్పటికి రెండు యెకరాల ఆస్తిమాత్రం మిగిలింది. దానితోనే కాంతం తల్లి ఎలాగో సంసారం నెట్టుకొస్తూ, కాంతాన్ని స్కూలు ఫైనలు దాకా తీసుకొచ్చింది. అప్పటికే పొలంమీద కొంతవరకు అప్పు తెచ్చి ఉంది. ఆ నెల కాంతం స్కూలు ఫీజుకు ఎంత ప్రయత్నించినా డబ్బు అందలేదు.

సాయంకాలం రెండు గంటలకు చంద్రం, కాంతం యింటికి వచ్చాడు.

"కాంతం! ఇదిగో నీ స్కూలు ఫీజు కట్టిన రసీదు. ఇక బడికి పోదాం రా" అంటూ తను కాంతం స్కూలు ఫీజు చెల్లించిన రశీదును కాంతం చేతిలో పెట్టాడు.

అది తీసుకొని, కాంతం తన స్నేహితుడి వంక వాత్సల్యంతో తిలకించాడు. అతని కన్నులు ఆనందబాష్పాలను కార్చినయి. కాంతం ఆనందాన్ని చూసి చంద్రం సంతోషపడ్డాడు.

పది సంవత్సరాలు గడిచినయి. కాంతం స్కూలు ఫైనలుతో తన చదువు ముగించి, ఒక బ్యాంకులో గుమాస్తాగా చేరాడు. అతనికి ఇప్పుడిద్దరు సంతానం. అతని రెండెకరాల పొలం ఈ మధ్యకాలంలో కర్పూరం లాగా హారించిపోయింది.

ఒకనాడు కాంతం బ్యాంకునుంచి సాయంకాలం ఇంటికి గాబరాపడుతూ వచ్చాడు. వస్తూనే కుర్చీలో కూలబడి ఆలోచనలో మునిగిపోయాడు. అతని ముఖంలో విచారం తాండవిస్తున్నది. కాంతం భార్య వచ్చి "భోజనానికి లేవండీ" అని పిలిచేదాకా కుర్చీలో అలానే కూర్చుండి పోయినాడు.

"ఏమండీ. ఎందుకలా వున్నారు?" అని భార్య కాంతాన్ని అడిగింది.

"ఏంలేదు" అన్నాడు.

"ఏం లేకపోతే ఎందుకంత దిగులుగా ఉన్నారు."

"ఏదో ఆఫీసుగోల. నువ్వేం అరుస్తావా తీరుస్తావా?"

"అదేమిటో నాతో చెప్పరాదుటండీ? మీలో మీరు దిగులు పడకపోతే?"

"బ్యాంకులో క్యాష్ వారంరోజులనుంచీ లెక్క సరిచూసుకోటం లేదు. ఇవ్వాళ చూసేటప్పటికి రెండువేల క్యాషు తక్కువయింది."

"రెండువేలే? ఏమైపోయిందంటారు అంతడబ్బు?"

"అదే తెలీటంలేదు."

"ఎవరన్నా మీ రజాగ్రత్తగా ఉన్నపుడు నోట్లకట్టలు కాజేసేరేమో? మీ కెవరిమీదైనా అనుమాన ముందా?"

"ఎవరిమీద అనుమాన ముందని చెప్పమంటావు? రోజూ కెంతమందో వస్తూ పోతుంటారు!"

"ఆఫీసులో ఇతర గుమాస్తాలను కనుక్కున్నారా?"

"అదీ అయింది. ఎవరూ మే మెరగమంటే మే మెరగమన్నారు."

"పోలీసు రిపోర్టిస్తే?"

"అదేం లాభంలేదు మనమే డబ్బు కాజేసి రిపోర్టు ఇచ్చామంటారు."

"మరయితే ఏమిటి?"

"అదే ఆలోచిస్తున్నది. ఇహ పదిరోజులలో ఆఫీసు ఆడిటు జరుగుతుంది. ఈ లోపుగా రెండువేలు క్యాషులో వెయ్యకపోతే మనగతి అధోగతే"

రెండువేలు? ఎవరు కాజేశారో? తను మొదటినుంచి అనుకుంటూనే ఉన్నాడు. ఈ క్యాషియరు ఉద్యోగంలో చాలా జాగ్రత్తగా వుండాలని. చివరికి జరగవలసిందేదో జరిగింది. ఇప్పుడు ముందు కర్తవ్యమేమిటి? తనకు రెండు వేలు ఎక్కడనుంచి వస్తయి ..? జైలు ప్రాప్తి తప్పదా?

ఆరాత్రి దంపతు లిద్దరూ అన్నంముందు కూర్చున్నారే కాని ముద్ద నోట్లోకి పోలేదు.

తాలూకాఫీసులో కొడుతున్న గంటలు తెల్లవారు జామున నాలుగు గంటలవరకూ కాంతం అతని భార్యా వింటూనే ఉన్నారు.

మనం ఆపదలో ఉన్నామని కాలం ఆగిపోదు గదా? తెల్లవారింది. ఎర్రబారిన కండ్లతో కాంతం, భార్యా నిద్రనుంచి లేచారు. వారిద్దరి ముఖాలను పరికిస్తే, వారి మనస్సులలో ఏమూలో ఒక ఆశాకిరణం వున్నట్లు మనకు పొడగట్టకపోదు వారి ఆశలకు ఆధారమయినవారెవరో ఇప్పుడే మనకెలా తెలుస్తుంది?

* * *

భోజనంచేసి తీరికగా పడకకుర్చీలో కూర్చుని నవల చదువుకొంటున్నది శాంత. శాంత యిప్పుడు ఆవూరి డిప్యూటీ కలెక్టరు భార్య. వంటకు వంటమనిషీ, పిల్లల నెత్తుకోటానికి పనిమనిషీ, షికారు కెళ్ళటానికి కారూ, చదువుకోటానికి కావలసినన్ని పుస్తకాలు చక్కగా అమరినయి. ఆమెకి యిప్పుడు కావలసినంత తీరిక.

"అమ్మగారు, మీకేదో అర్జంటు ఉత్తరం వచ్చిందండీ" అంటూ ఒంట్రోతు శాంతకు కవరందించాడు

శాంతకు పుట్టింటివాళ్ళ దగ్గరనుంచి చాలా అరుదుగా మాత్రమే ఉత్తరాలు వస్తుంటాయి. బాల్య స్నేహితురాలయిన సీత దగ్గరనుంచి ఉత్తరంవచ్చి ఒక సంవత్సరమయింది. అప్పుడు తను జవాబు వ్రాసింది, తన భర్త ఖులాసా అని; తన సంసారం హాయిగా జరిగి పోతున్నదని.

కవరు చించి శాంత ఉత్తరం ఇలా చదివింది.

"ప్రియమైన శాంతకు,

మనం ఒకరికొకరం ఉత్తరాలు వ్రాసుకొని సంవత్సరమయింది. నీవూ, నీభర్తా, పిల్లలూ అంతా క్షేమమని తలుస్తాను.

మేము ఇంతవరకు కులాసాగానే ఉన్నాం. జీవితాంతంవరకు నిర్విచారంగా జరిగిపోతుందిగదా అనుకొన్నాను. భర్త ప్రేమకు పాత్రురాలను అయినదానిని అవటంవల్లా, సంసార పోషణకు భర్తకేదో ఉద్యోగం దొరికినందువల్ల, ఈ సంసార యాత్ర సుఖంగా ముగియగలదని భావించాను.

కాని కాలం ఎల్లకాలం ఒకే రీతిగా ఉండదుగదా!

మే మిప్పుడు మహాపదలో చిక్కుకొని వున్నాము. ఈ ఆపదనుంచి యెలా బయట పడాలో మాకేం బోధపడటం లేదు. నాభర్త చాలా దిగులుగా ఉన్నారు. మా భవిష్యత్తు ఏమి కానున్నదో తెలియదు

ఈ దుఃఖాంధకారంలో నువ్వు నాకు ఆశాజ్యోతిలాగా జ్ఞప్తికి వచ్చావు. కాని నిన్ను ఈ సహాయం అర్థించటానికి నాకే సంకోచంగా వుంది. మాకొచ్చిన ఈ ఆపద ఆర్థికమయినది. ఈ కష్ట సమయంలో నువ్వు తప్పకుండా తోడ్పడుతావని గట్టి నమ్మకముంది. అందుకు నీవు సమర్థురాలవని కూడా నేను భావిస్తున్నాను. అంగీకారం తిరుగు టపాలో నాకు తెలిపితే పరిస్థితులు నీకు తెలుపగలను.

నీ ఉత్తరంకోసం ఎదురు చూస్తూవుంటాను.

నీ బాల్య స్నేహితురాలు,<br>
సీత"

ఉత్తర చదివిన శాంతకు తన స్నేహితురాలికి కలిగిన ఆపద ఏమిటో బోధపడలేదు. ఈ ఆపద "ఆర్థికమయినది" అన్న మాటవల్ల సీత తనవలన ధన సహాయం అపేక్షిస్తున్నదన్న విషయం నిర్వివాదాంశంగా తోస్తున్నది. అయితే ఆ విషయం స్పష్టంగా యెందుకు వ్రాయలేకపోయిందో కారణం తెలియటం లేదు. ఏమయినా తన భర్త బ్యాంకులో అయిదారు వేలదాకా నిలువచేసిన మాట నిజం. నెల తిరిగేసరికి నాలుగు పచ్చ కాగితాలు భర్త చేతికొస్తాయి. సీతకు ఎంత డబ్బు అవసరమయి ఉంటుంది? ఏమో? కాని ఆ మొత్తం మూడు అంకెల లోపుగా ఉండి ఉండాలి. అంతకు ఎక్కువ మొత్తం ఎంత స్నేహితురాలయినా తన్ను అడగటానికి ఎలా సాహసిస్తుంది. తన దగ్గర ఇప్పుడు నాలుగువందల దాకా రెడీ క్యాషు ఉంది. ఆమాత్రం డబ్బు తన బాల్య స్నేహితురాలు కోసం తప్పకుండా సహాయం చెయ్యడం తన ధర్మం!

శాంత, అసలు సంగతి తెలుపుతూ, తనకు ఉత్తరం వ్రాయవలసిందనీ, తను సహాయం చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాననీ సీతకు ఉత్తరం వ్రాసింది.

శాంతకు తిరుగా జవాబు వచ్చింది.

"ప్రియమైన శాంతకు,

నీ ఉత్తరం చూసి, నీవు యింకా నీ చిన్ననాటి స్నేహం, ఉదారబుద్ధి మరిచిపోలేదని, తెలుసుకొన్నాము. చాలా సంతోషం.

నాభర్త ఒక చిన్నబ్యాంకులో పనిచేస్తున్న విషయం తెలుసుకొంటావు

ఆ ఐదురోజుల క్రిందట బ్యాంకులో దొంగతనం జరిగింది. బ్యాంకు డబ్బు రెండువేల రూపాయలు పోయినయి. ఇంకా గడువు ఐదు రోజులుంది. ఈలోగా బ్యాంకుకి నా భర్త రెండువేలు చెల్లించాలి. లేకపోతే నా భర్తకు కారాగారవాసం తప్పదు.

నీవు తప్పక సహాయం చేస్తావని తలుస్తాను. సాధ్యమయినంత త్వరలో నీఋణం తీర్చుకొంటాము.— అభాగిని సీత"

ఉత్తరం చదివిన శాంత మనస్సు పరిపరి విధాల పోయింది. అంతడబ్బు తాను సహాయం చేస్తానని యెలా ఆశించింది? రెండువందలు కాదు రెండువేలు, పాపం. ఆపదలో ఉన్నది సీత. భర్త నడిగితే? ఒకవేళ ఇస్తే, డబ్బు తిరిగి ఎప్పటికి రాను?

తన భర్త ఒక బ్యాంకు గుమాస్తా అని, డబ్బదిరూపాయల జీతమని, ఒక ఉత్తరంలో సీత వ్రాసిన విషయం శాంత బుర్రలో మెదిలింది. వాయిదాలమీద బాకీ తీరుస్తారనుకొన్నా పది, పదిహేను సంవత్సరాలు పడుతుంది.

అడిగితే తనభర్త కాదనడు తనమీద భర్త కానమ్మకముంది. కాని తనకే సంకోచంగావుంది.

శాంత ఈ విషయాన్ని గురించి తనలో తాను దీర్ఘంగా ఆలోచించుకొని, చివరకు తన దగ్గర ఉన్న నాలుగువందల క్యాషు సీతకుపంప నిశ్చయించుకొన్నది. ఇది తన సొంత డబ్బు. తను ఎల్లా ఖర్చు పెట్టుకొన్నా భర్త అడగవలసిన అవసరంలేదు.

తన భర్తకు ఇలా తన స్నేహితురాలొకా మెకు డబ్బు పంపుతున్నానన్న విషయం చెప్పటమా? మానటమా? చెపితే అనవసరంగా ఇంతడబ్బు ఇంకొకళ్ళకి పంపటం ఆయనకి ఇష్టమో? కాదో? చెప్పకుండా ఉండటమే బాగుంటుం దనిపించింది శాంతకు.

ఇంకా మూడు రోజులు గడువుంది. ఏపూట కాపూట మనియార్డరు వస్తుందని ఎదురుచూసింది సీత. ఆరోజు ఉదయం పదిగంటలకు పోస్టుమేను ఒకకవరు తీసుకొచ్చి యిచ్చాడు సీతకి. నాలుగువందల రూపాయల మనియార్డరుకూడా ఇచ్చాడు. ఉత్తరం చింపి చదివింది సీత.

"ప్రియమైన సీతకు,

నీ ఉత్తరం అందింది. ఈ ఆపదలో మీ కుటుంబానికి సహాయం చేయలేనందుకు చింతిస్తున్నాను. అయినా నాదగ్గర రెడీగా ఉన్న నా సొంతడబ్బు నాలుగువందలరూపాయలు ఇవాళే మనియార్డరు చేసేను. అది నీ కీపాటికి అంది ఉండవచ్చు. మిగతాసొమ్ము, నీ వింకెక్కడైనా తీసుకొని ఈ చిక్కులోనుంచి బయట పడతావని ఆశిస్తున్నాను. కష్టసమయంలోఉన్న మీ కుటుంబానికి నా సానుభూతి.

నీ స్నేహితురాలు
శాంత"

సీత ఆశాసౌధాలు కూలినయి. తన భర్తకు కారాగార వాసం తప్పేటట్లు లేదు. కావలసింది రెండువేల రూపాయలయితే నాలుగు వందలే మూలకి సరిపోతయి?

ఆనాటి సాయంత్రం బ్యాంకునుంచి తిరిగి వచ్చిన రమాకాంతానికి సీత నాలుగు పచ్చ కాగితాలు అందించింది.

రమాకాంతం ఆశ్చర్యపోతూ, "ఇవెక్కడివి?" అన్నాడు.

"నా స్నేహితురాలికి జాబు వ్రాస్తే తన దగ్గర ఉన్న నాలుగు వందలూ పంపించింది" అంది సీత.

"నాలుగు వందలేమూలకి? రెండువేలుకట్టాలి ఇంకా మూడు రోజులు గడువుంది. నేను ఒక స్నేహితుడికి జాబు వ్రాసేను. ఆయన జవాబు కోసం ఎదురు చూస్తున్నాను" అన్నాడు.

మతిపోయిన కాంతం బ్యాంకులో యంత్రం లాగా తన పని చేసుకొంటున్నాడు.

గడువు పదవ రోజున అంటే రేపు ఆడిటు జరుగుతుందనగా పదకొండు గంటలకు బ్యాంకు పని చూసుకొంటున్న రమాకాంతానికి పోస్టుమేను ఒక ఇన్స్యూర్డు కవరు ఇచ్చాడు.

రసీదు మీద సంతకం చేసి కవరు విప్పి చూసుకొన్నాడు కాంతం.

కవరులో ఇరవై వంద రూపాయల నోట్లు కాంతం కళ్లని జిగేలు మనిపించినయ్.

రమాకాంతం ఆనందానికి మితిలేదు. తన బాల్య స్నేహితుడు చంద్రానికి వారం రోజుల క్రితం వ్రాసిన లేఖ వృథా పోలేదు.

తర్వాత నాలుగయిదు రోజులకు శాంతకు సీత దగ్గరనుంచి నాలుగు వందల రూపాయలు మనియార్డరు వచ్చింది. అదిచూసి శాంత ఆశ్చర్యపోయింది. మనియార్డరు కూపనులో ఇలావుంది.

"ప్రియమైన శాంతకు,

నీ చేతనయిన సహాయం నీవు చేసినందుకు నాకు చాల సంతోషం. మేము ఆపదనుంచి బయటపడ్డాము. మా వారి స్నేహితులొకరు రెండు వేలు సమయానికి పంపించి ఆదుకొన్నారు. కాబట్టి నీ డబ్బు అవుసరం లేనందున తిరిగి పంపిస్తున్నాను.

కృతజ్ఞతతో,
సీత"

తను పంపించిన డబ్బు తిరిగి రావటం శాంతకు కొంచెం కష్టంగానే ఉంది. రెండు వేలు పంపిన ఆ ఉదార బుద్ధిగల స్నేహితుడెవరు?

తరువాత వారం రోజులకు శాంత ఈ విష

యము తన మనస్సులో దాచుకోలేక భర్తకు చెప్పినపుడు తన భర్త ముఖంలో ఎందుకో చిరునవ్వు గోచరించింది.

* * *

రెండు సంవత్సరాల అనంతరం రమాకాంతం, చంద్రం కూతురు వివాహ సందర్భములో సపరివార సమేతంగా చంద్రం ఇంటికి వచ్చాడు. చంద్రం తన భార్య శాంతను సీతా రమాకాంతాలకి పరిచయం చేసేడు.

సీతా, శాంతలు ఒకరి నొకరు చూసుకొన్నారు. వారి సంతోషానికి మేరలేదు.

మాటల సందర్భంలో శాంత భార్యతో,

"రెండు సంవత్సరాలక్రిందట మనకి రెండు వేల రూపాయలు పంపి సకాలంలో సహాయపడ్డ మిత్రుడితడే" అని చెప్పాడు.

ప్రక్కనే ఉండి వింటున్న శాంతికు అసలు విషయం బోధపడి, తనభర్త ఉదార బుద్ధికి విస్తుపోయింది.

# నలుపూ - తెలుపూ

విశ్వం

పిల్లలనేప్పటికి మేరియా మాంటిసోరీ పేరు జ్ఞాపకం వస్తుంది. ఆమె మొన్ననే గతించింది. కాని ఆమె యేర్పరచిన పద్ధతి చాలా దేశాలలో శాశ్వతంగా పాదుకొనిపోయింది.

సామాన్యంగా మనందరికీ పిల్లలను బాగా చదివించాలనీ, బుద్ధిమంతులను చేయాలనీ విపరీతమైన ఆసక్తి ఉంటుంది. ఆ ఆసక్తి వారినేదో ఖాలీసీసాల్లా భావించుకొని వాటినిండా మనకు నచ్చిన భావాలన్నిటినీ నింపితే సరిపోతుందని నిశ్చయించుకుంటాము. ఇక నేం-నడుం కట్టి బెత్తం పట్టుకొని వారిలోకి బలవంతంగా మన దృష్టిలో ఆరోగ్యకరమైన ఆహారం అనుకున్న దాన్ని యెక్కించేందుకు మహా ప్రయత్నం చేస్తాము.

వారు లొంగిరావాలి. రాకపోతే రప్పించాలి. మనమేదయితే ఏ దృష్టితో నయితే చూస్తామో వారూ దాన్ని అదే దృష్టితో చూసి తీరాలి.

మనం పెద్దలం-వారు పిల్లలు. మనం యజమానులం-వారు విధేయులై వుండాలి.

ఈ దృష్టితోనే మన భావాలను—అంతకన్న మన అసూయా ద్వేషాలనడం న్యాయం—వారి తలలోకి కూరడంలో కూడా మనకు నచ్చిన పద్ధతినే అనుసరిస్తాం.

ఇదంతా తప్పని గట్టిగా చెప్ప గలిగింది మాంటిసోరీ ఆ మాట కేవలం యేదో సిద్ధాంత సూత్రంగా. నీతి వాక్యంగా చెప్పి ఆగిపోలేదు.

తన యావజ్జీవితాన్ని ధారవోసి, అనేక స్థలాల్లో అనేక బాలబాలికలతో కలిసిమెలిసి తిరిగి, లక్షలాది శిశువులను పరిశీలించి వారి మనః ప్రవృత్తి శాస్త్రీయంగా కనిపెట్టి తరువాత ఆమె కొన్ని సూత్రాలను సిద్ధాంతరీత్యాను, ఆచరణానుగుణంగానూ తయారు చేసింది.

ఒక్కొక్క విషయంలో ఒక్కొక్క మేధావి యెలా ప్రవేశించి గొప్ప విప్లవం తీసుకొస్తాడో చూస్తే చిత్రంగా ఉంటుంది. యాదృచ్ఛికంగా జరిగే సంఘటనలే చారిత్రక ప్రముఖఘటనలుగా రూపొందుతూ ఉంటాయి.

ఈమె ఇటలీలో మొదట వైద్యం చదువుకున్నది. తరువాత మనశ్శాస్త్రం చదువుకుంది. వైద్యాన్ని ప్రధానంగా జీవితంలో అనువర్తిస్తున్నది.

అలాంటి సమయంలో కొన్ని ఫాక్టరీలు కట్టిన యజమానులు కార్మికుల కోసం యిళ్ళు కట్టారు. స్త్రీ పురుషులందరూ పనులకు వెడితే వారి పిల్లలందర్నీ యిళ్ళలో వదిలివేయడం కష్టమనిపించింది. ఇందుకోసం పిల్లలందరినీ ఒకచోట చేర్చి కాపలా మనిషి నొకదాన్ని పెడితే సరిపోతుందని కార్మిక యాజమాన్య సంఘం నిర్ణయించింది

ఇలాంటి పిల్లల యిళ్లను చూచుకునేందు